క్లుప్తంగా

నేడు పల్లె ప్రగతి దినోత్సవం

నడిగూడెం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బూరుగడ్డలో పాపన్నగౌడ్ విగ్రహం ఆవిష్కరణ



పాపన్నగౌడ్ విగ్రహం ఊరేగింపు నిర్వహిస్తున్న గౌడ కులస్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ గ్రామంలో శ్రీ నల్లకట్ట మహేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్, హెడ్‌కానిస్టేబుల్ నారగోని శంకర్‌గౌడ్, సర్పంచ్ షేక్ సలీమారంజాన్‌లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, ఆలయ చైర్మన్ సోమగాని గురవయ్యగౌడ్, సురభి కుషేల్‌గౌడ్, సైదులుగౌడ్, నాగరాజుగౌడ్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



వెంకన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని పాత నేరేడుచర్లకు చెందిన డికొండ వెంకన్న అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. బుధవారం బీజేపీ నాయకులు వెంకన్నను పరామర్శించి రూ.7 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సంకలమద్ద సత్యనారాయణరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, రాజేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, దేవిరెడ్డి నాగిరెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ పరిధిలోని ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం మండల కేంద్రానికి చెందిన సంగిశెట్టి నారాయణ– ఉమ దంపతుల కుమార్తె సౌమ్యశ్రీ పుట్టిన రోజును పురస్కరించుకొని వృద్ధులకు, మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు మణెమ్మ, సుధాకర్, రాము, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, రక్తదాతలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం పులిచింతల ప్రాజెక్టు కాలనీ గ్రామంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. తలసేమియా బాధితుల కోసం రక్తం సేకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, సర్పంచ్ కొమ్ము గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్య ట్రస్ట్ ఆధ్వర్యంలో..

హుజూర్‌నగర్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన జనచైతన్య ట్రస్ట్ తరఫున యువకులు బుధవారం రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో అత్యవసర వైద్య సేవలు పొందుతున్న హుజూర్‌నగర్‌కు చెందిన వ్యక్తికి రక్తదానం చేశారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



రూ.30 వేలు విరాళం అందజేస్తున్న బాలెబోయిన సైదులు

చిలుకూరు : చిలుకూరులో గౌడ్ కులస్తుల కులదైవమైన కంఠమహేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన బాలెబోయిన లక్ష్మి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఆర్మీ మాజీ సైనికుడు బాలెబోయిన సైదులు దంపతులు రూ.30 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ్ సంఘం జాతీయ నాయకులు బూర మల్సూర్ గౌడ్, కలాలీ సంఘం అధ్యక్షుడు మరీదు సైదులు, ఉపాధ్యక్షుడు కొండా శేషయ్య, నాయకులు యరగాని నాగయ్య, బెల్లంకొండ నాగయ్య, కట్టెకోల పెద్ద సైదులు, కట్టెకోల కేవీ, బాలేబోయిన హనుమంతు, ధనమూర్తి, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ మైనింగ్!

- సీతారాంపురం పరిధిలో ప్రభుత్వ గుట్టను మాయం చేస్తున్న అక్రమార్కులు
- రాత్రి వేళల్లో రాళ్లను బ్లాస్టింగ్ చేసి ఉదయాన్నే టిప్పర్లలో తరలింపు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు



సీతారాంపురం గుట్టలో అక్రమంగా మైనింగ్ చేస్తున్న ప్రదేశం

చిలుకూరు : మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ పరిధిలోని గుట్టల్లో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా జరుగుతోంది. అక్రమార్కులు రాత్రి సమయంలో గుట్టల్లో పేలుడు పదార్థాలతో రాళ్లను బ్లాస్టింగ్ చేసి తెల్లవారిన తరువాత టిప్పర్లతో క్రషర్ మిల్లులకు తరలిస్తున్నారు. ఈ గుట్ట కోదాడ– హుజూర్‌నగర్ హైవే రోడ్డుకు కొంత దూరంలోనే ఉంటుంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాయిని మాత్రం పట్ట పగలే గుట్టుగా తరలిస్తున్నారు. ఈ విషయంపై మీడియాలో పలుమార్లు కథనాలు వచ్చినా కొందరు అధికారులు మాముళ్లకు అలవాటు పడి అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాత్రి సమయంలో బ్లాస్టింగ్

అయితే సామాన్యుడు కొంత భూమి ఆక్రమించి సాగు చేసుకుంటేనే నోటీసులు ఇచ్చి భయాందోళనకు గురిచేసే అధికారులు ప్రతిరోజూ వందల సంఖ్యలో టిప్పర్లతో రాయిని తరలిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. రాళ్లను బాంబుల ద్వారా బ్లాస్టింగ్ చేసే సమయంలో పెద్ద ఎత్తున శబ్దాలు వచ్చి రాత్రి సమయంలో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇక పట్టపగలు అటు వైపు వెళ్లాలన్నా భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్టల్లో మైనింగ్‌పై విచారణ చేసి అక్రమ మైనింగ్‌ను నిలిపివేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై మిర్యాలగూడెం మైనింగ్ అధికారిని వివరణ కోరగా తమకు ఎలాంటి విషయం తెలియలేదని, విచారణ చేస్తామని తెలిపారు.

979 సర్వే నంబర్‌లో..

చిలుకూరు రెవెన్యూ పరిధిలోని సీతారాంపురం శ్మశాన వాటిక, మెగా పల్లె ప్రకృతి వనానికి వెళ్లే దారిలో 979 సర్వే నెంబర్‌లో వందల ఎకరాల భూమి ఉంది. అయితే ఈ సర్వే నెంబర్‌లో ప్రభుత్వ, పట్టా భూమి కలదు. కానీ ఎవరిది పట్టా భూమి, ఎవరిది సీలింగ్ భూమి తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ సర్వే నెంబర్‌పై పలుమార్లు అధికారులు సర్వే చేసిన పూర్తిస్థాయిలో ఏ రైతు భూమి ఎక్కడ ఉందో ఎవరిది పట్టా భూమి అనే విషయాన్ని రెవెన్యూ అధికారులు తేల్చలేకపోయారు. దీంతో పలువురు అక్రమంగా మైనింగ్ చేస్తూ గుట్టను కొల్లగొడుతున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే ఆలయాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నడిగూడెం : బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

నడిగూడెం : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే దేవాలయాలు అభివృద్ధి జరుగుతోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎకలాస్‌ఖాన్‌పేటలో బొడ్రాయి ప్రతిష్ఠ, ముత్యాలమ్మ తల్లి, పోతరాజు ఆలయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని మతాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో యాదాద్రి నర్సింహస్వామి ప్రధాన అర్చకుడు నర్సింహచార్యులు, గ్రామ సర్పంచ్ దొడ్డి మానస, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, దేవబత్తిని సురేష్ ప్రసాద్, దేవబత్తిని రమేష్ ప్రసాద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, వీరస్వామి, వెంకటరెడ్డి, గోసుల రాజేష్, పుట్టా రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పద్మావతి పూజలు..



నడిగూడెం : పూజలు చేస్తున్న ఉత్తమ్ పద్మావతి

ఎకలాస్‌ఖాన్‌పేటలో బుధవారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఉత్తమ్ పద్మావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మోతె : రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రంగాపురంతండాలో జరిగిన బొడ్రాయి, అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు, రంగాపురంతండా మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, వీరశేఖర్, గోపిచందర్‌రెడ్డి, నరేష్, రామారావు, పొట్టానాయక్, దస్రూనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



నేరేడుచర్ల : వైకుంఠాపురంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే



హుజూర్‌నగర్‌రూరల్ : ఎమ్మెల్యే సైదిరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ తదితరులు

నేరేడుచర్ల : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వైకుంఠాపురంలో రూ.20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, నీటి సరఫరా వంటి వసతులను కల్పించడం జరిగిందన్నారు. అనంతరం పెంచికల్‌దిన్నకు చెందిన కాంగ్రెస్ యూత్ సభ్యులు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సోమప్పలో కాటమయ్య గుడి, సోమప్ప దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, సర్పంచ్‌లు తాటికొండ అమృతారెడ్డి, పల్లెపంగ నాగరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, ఎంపీటీసీ లింగయ్య, రాజేష్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, శ్రీనివాస్, నాయకులు నాగార్జున, బాలునాయక్, రాజేష్ తదితరులున్నారు.

గోడౌన్‌ల నిర్మాణంతో రైతులకు మేలు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించే గోడౌన్‌లతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని శ్రీనివాసపురం, లక్కవరంలో నాబార్డ్ నిధులు ద్వారా మంజూరైన రూ.75 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న గోడౌన్స్‌కు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్‌లు పత్తిపాటి రమ్యనాగరాజు, గుండెపంగు సౌజన్యనరేష్, పీఏసీఎస్ చైర్మన్ కట్టా గోపాలరావు, ఎంపీటీసీలు విజయలక్ష్మి, కాశమ్మ, డైరెక్టర్లు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

హుజూర్‌నగర్‌రూరల్ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కరక్కాయలగూడెంలో శ్రీభ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ కీత జయమ్మధనమూర్తి, కీత కృష్ణమోహన్ పాల్గొన్నారు.

గ్రామ దేవతల అనుగ్రహం ఉండాలి

గరిడేపల్లి : గ్రామ దేవతల అనుగ్రహంతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రాగూడెం గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సర్పంచ్ బొలిశెట్టి సుధీర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సేవలు



కోదాడ: వైద్యారోగ్య దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



హుజూర్‌నగర్‌లో వైద్యారోగ్య ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు

కోదాడ : తెలంగాణలో ప్రభుత్వ వైద్యశాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం కోదాడలో జరిగిన తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో ప్రభుత్వ వైద్యశాలలు ఎంతో ముందున్నాయన్నారు. కరోనా కాలంలో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం గట్టి కృషి చేస్తుందని చెప్పారు. డయాగ్నస్టిక్ సెంటర్ల నుంచి డయాలసిస్ సెంటర్ల వరకు ఏర్పాటు చేసి పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వైద్యసేవలను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం మెరుగైన వైద్యసేవలందించిన వైద్యసిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ చక్రవర్తి, నరసింహ, సురేష్, లక్ష్మీప్రసన్న, రంజిత్‌రెడ్డి, యాదగిరి, నవ్య, సాంబశివరావు, వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజావైద్యంపై నమ్మకం పెరిగింది : ఎమ్మెల్యే

హుజూర్‌నగర్ : తెలంగాణలో ప్రజావైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, వినూత్న కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గర్భిణులకు ఇచ్చే న్యూట్రిషన్ కిట్లు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయిన వారికి కేసీఆర్ కిట్‌తో పాటు రూ.13 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రజారోగ్యం అంటే గాలిలో దీపంలాగా ఉండేదని స్వరాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగానికి కొత్త రూపం ఇచ్చారన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం డయాలసిస్ సెంటర్ల నుంచి డయాగ్నస్టిక్ కేంద్రాల వరకు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ప్రభుత్వ రంగంలో ఒకేసారి నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టి దేశ చరిత్రలోనే ఒక సరికొత్త విప్లవానికి తెరతీసారన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య ప్రగతి నివేదిక కరపత్రం ఆవిష్కరించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖలో ఉత్తమ సేవలు అందించిన వారిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సాహితి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్, డీపీఓ యాదయ్య, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, సూపరింటెండెంట్ డాక్టర్ కరుణ్‌కుమార్, ఆర్‌ఎంఓ డాక్టర్ రవికుమార్, తహసీల్దార్ జయశ్రీ, ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, పార్వతి, జెడ్పీటీసీ కె.సైదిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి రంగాచారి, డాక్టర్లు దశరథ, శ్రీకాంత్, నాగమణి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్లు కేటాయించడం అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి

మోతె : మండలంలో అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. రావిపహాడ్, అప్పన్నగూడెం, విభళాపురం, నాగయ్యగూడెం, మోతె గ్రామాల్లో నిర్మించిన 164 ఇళ్లను అర్హులైన నిరుపేదలకు ఇవ్వకుండా అనర్హులకు ఇవ్వడం అన్యాయమన్నారు. రేషన్ కార్డు సహితం లేని వారికి ఇళ్లు ఎలా మంజూరు చేశారని అధికారులను ప్రశ్నించారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు సాధించేంత వరకు అఖిల పక్షాలను కలుపుకొని ధర్నా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాయకులు ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బండారు ప్రభాకర్‌రెడ్డి, బోళ్ల వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, సీపీఎం నాయకులు బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో ఫలితాల్లో 'రేస్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రేస్ కళాశాల చైర్మన్ బాణాల వసంతవెంకటరెడ్డి

కోదాడఅర్బన్ : నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) ఫలితాల్లో కోదాడ రేస్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన కె.హరిణి 509వ ర్యాంకు, పెన్నా అబ్దుల్ అహ్మద్ ఇబ్రహీం 459, ఎస్‌డీ మదీహా తబ్సీం 441, జి.కీర్తన 437, వై.సాయిశ్రీ 420, కె.కీర్తన 400 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి విద్యార్థులను కళాశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హేమకు 502 మార్కులు



మొక్కా హేమ

హుజూర్‌నగర్ : నీట్ ఫలితాల్లో హుజూర్‌నగర్‌కు చెందిన మొక్కా హేమ 502 మార్కులు సాధించింది. మఠంపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వర కు చదివిన ఆమె కోదాడలోని ప్రభుత్వ కేఆర్‌ఆర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ఆ తర్వాత హైదరాబాద్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని నీట్ పరీక్ష రాసి 502 మార్కులతో 92 వేల ర్యాంక్ సాధించినట్లు ఆమె తెలిపింది. దీంతో పట్టణానికి చెందిన పలువురు ఆమెను అభినందించారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా

చివ్వెంల(సూర్యాపేట) : అతి వేగంగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటన మండలంలోని వట్టిఖమ్మంపహాడ్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నూతన్‌కల్ మండలం మాచినపల్లి నుంచి సూర్యాపేటకు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విద్యుత్ వైర్లు తెగి రహదారిపై పడ్డాయి. లారీలో ఉన్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కనుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



మునగాల : విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామంలో బుధవారం బొడ్రాయిలు, శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. పాత ముకుందాపురం, కొత్త ముకుందాపురం గ్రామాలలో బొడ్రాయి ప్రతిష్ఠలు, జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించే దేవాలయంలో శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠను వేద పండితుల మంత్రోత్సవాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద 20వేల మందికి అన్నదానం చేశారు. ఈ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్మతరెడ్డి శశిధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు పెద్దఎత్తునపాల్గొన్నారు.

కోనాయిగూడెంలో..



గరిడేపల్లి : కోనాయిగూడెంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని కోనాయిగూడెంలో బుధవారం శ్రీకనకదుర్గ, పరమేశ్వరి, అంకమ్మ, పోతరాజు, విరాట్ శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు మూడవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీవెంకట్‌రెడ్డి, ప్రధాన పూజారులు రాయపోలు శ్రీరామయ్యశర్మ, రాళ్లబండి రాజశేఖరశర్మ, భద్రయ్యశర్మ, ఉపేందర్‌శర్మ, జ్ఞానసాయి భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



మేళ్లచెరువు : చిన్నారులకు పలకలు అందజేస్తున్న ఎంపీపీ పద్మ

హుజూర్‌నగర్‌రూరల్ : పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సర్పంచ్ గుజ్జుల సుజాతాఅంజిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అమరవరంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కోట్టిరెడ్డితో కలిసి ఆమె చిన్నారులకు అక్షరాభాస్యం నిర్వహించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ పి.రమేష్, మామిళ్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, పురుషోత్తంరావు, సోమశేఖర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

మేళ్లచెరువు : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొట్టె పద్మ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతనంగా పాఠశాలలో చేరిన ఐదుగురు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఉపేందర్, ప్రధానోపాధ్యాయురాలు కె.వెంకమ్మ, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సైదిరెడ్డి, ఎన్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నేరేడుచర్ల : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. బుధవారం మండలంలోని రోళ్లవారిగూడెంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్టా శ్రీనివాస్‌రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు దాదేసాహెబ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయ్‌కుమార్, యాదగిరి, కోటిరెడ్డి ఉన్నారు.

బుర్కచర్లలో..

మోతె : మండలంలోని బుర్కచర్లలో బడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కర్ల సాగర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు సింహాద్రి, రాము, విజయలక్ష్మి, అరుణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కొండ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నత్తనడకన ఆలయ పునర్నిర్మాణ పనులు



నడిగూడెంలో నిలిచిపోయిన శ్రీసారంగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు

- నోటీసులు పంపినా నిర్లక్ష్యం వీడని కాంట్రాక్టర్

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ సారంగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ రూ.50 లక్షలు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ 2019 పనులు మొదలు పెట్టారు. కానీ గత నాలుగేళ్లుగా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పనులు త్వరగా పూర్తిచేయాలని దేవాదాయ శాఖ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు కూడా పంపారు. అయినా పనులను సదరు కాంట్రాక్టర్ నేటికీ ప్రారంభించలేదు. ఇప్పటికైనా పనులు తక్షణమే ప్రారంభించి నిర్మాణ పనులను పూర్తిచేయాలని గ్రామ సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, గ్రామస్తులు కోరుతున్నారు.

హద్దురాళ్ల తొలగింపు

సూర్యాపేట : పట్టణంలో అనుమతి లేని వెంచర్లలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి ఆదేశాలతో సిబ్బంది హద్దు రాళ్లను తొలగించారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ, బేచిరాగ్ మాదారం, అంబేడ్కర్ నగర్, సుందరయ్య నగర్, గిరినగర్, రాయనిగూడెంలతో అనుమతి లేకుండా చేసిన లే అవుట్లలో హద్దురాళ్లను, రోడ్లను ధ్వంసం చేశారు.